క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో బోధన



తాటాకులదిన్నెలో అవగాహన ర్యాలీ

కొడవలూరు : అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో బోధన ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.పద్మావతి సూచించారు. మండలంలోని తాటాకుల దిన్నెలో 'అంగన్‌వాడీ పిలుస్తోంది' కార్యక్రమంపై శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్పొరేటుకు దీటుగా అన్నిరకాల బోధనా సామగ్రి అందుబాటులో ఉందన్నారు. ప్రతి చిన్నారిని అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని, తద్వారా విద్యతో పాటు పోషక విలువలున్న ఆహారం అందిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ఎస్కే మస్తాన్‌వలి, అంగన్‌వాడీ కార్యకర్త జి.అరుణ, పంచాయతీ కార్యదర్శి దామోదర్, అంగన్‌వాడీ సహాయకులు అమూల్య, లక్ష్మీరాజ్యం పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం



నెల్లూరు(బృందావనం) : నగరంలోని మూలాపేటలో ఉన్న శంకరమఠంలో చండీహోమాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కంచికామకోటి పీఠానికి చెందిన వేదపండితుల ఆధ్వర్యంలో నిర్వహించిన చండీహోమంలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉభయకర్తలుగా కొల్లూరు లక్ష్మీనరసింహం దంపతుల వ్యవహరించారు. నిర్వాహకులు కొత్రపాటి నందకిశోర్, ఉషాకుమారి దంపతులు పర్యవేక్షించారు.

ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు



నెల్లూరు (టౌన్) : రూరల్ మండలంలో ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి పిచ్చిబాబు మాట్లాడుతూ ప్రభుత్వ హామీ మేరకు 117 జీఓను రద్దు చేయాలన్నారు. ఇంగ్లిష్, తెలుగు మీడియంలను కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో మండల గౌరవాధ్యక్షుడు రఘు, జిల్లా అధ్యక్షులు సుధీర్‌బాబు, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఘనంగా సంగీత దినోత్సవం



సంగీత గురువులకు సన్మానం

నెల్లూరు(బృందావనం) : నగరంలోని ఇస్కాన్ సిటీలో ఉన్న హనుమాన్ ఆలయంలో నెల్లూరు బాలభవన్ డైరెక్టర్ గోవిందరాజు సుభద్రాదేవి ఆధ్వర్యంలో ప్రపంచ సంగీత దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సంగీత ఉపాధ్యాయులు శ్రీవత్సల, ఎం.ఇందిర వారి శిష్యబృందంతో పలు కీర్తనలు ఆలపించారు. ఈ సందర్భంగా వారిని సత్కరించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు.

'నేను బడికి పోతా'పై అవగాహన ర్యాలీ



నెల్లూరు (టౌన్) : జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నేను బడికి పోతా కార్యక్రమంపై స్థానిక జిల్లా బాలికల ఉన్నత పాఠశాల నుంచి పొదలకూరురోడ్డులోని పద్మావతి సెంటర్ వరకు శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బడి మానేసిన పిల్లలు మళ్లీ బడిలో చేరాలంటూ ప్లకార్డులతో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి, డిప్యూటీ డీఈఓ ప్రసన్నలక్ష్మి మాట్లాడుతూ బడిఈడు పిల్లలను వందశాతం పాఠశాలల్లో చేర్పించడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఏఎంఓ సుధీర్‌బాబు, రూరల్ ఎంఈఓ మురళీధర్, స్థానిక కార్పొరేటర్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

యోగా చేద్దాం..

ఆరోగ్యాన్ని కాపాడుకుందాం

• వీఎస్‌యూ వీసీ జీఎం సుందరవల్లి



వెంకటాచలం : ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో యోగా దినోత్సవం

వెంకటాచలం : మానసిక ప్రశాంతతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు యోగా చేద్దామని వీఎస్‌యూ వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లి తెలిపారు. మండలంలోని కాకుటూరు వద్దనున్న విక్రమ సింహపురి యూనివర్సిటీలో ఎన్ఎస్ఎస్ విభాగం, ఇషా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులకు మానసిన ప్రశాంతత చాలా అవసరమని, యోగాతోనే సాధ్యమవుతుందని చెప్పారు. మన సాంప్రదాయ పద్ధతులైన యోగా, ఆయుర్వేదాన్ని అందరూ ఆచరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఉదయ్‌శంకర్, ప్రోగ్రామ్ అధికారిణి డాక్టర్ కె.సునీత తదితరులు పాల్గొన్నారు.

ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో..

మండలంలోని సరస్వతీనగర్ వద్దనున్న కమ్యూనిటీ హాల్లో ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. యోగాతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని, తమ జీవితాల్లో యోగాను అంతర్భాగం చేసుకోవాలని ఆ కేంద్రం డైరెక్టర్ మాడభూషి సంపత్‌కుమార్ పేర్కొన్నారు.

• వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రాంగణంలో యోగా దినోత్సవ వేడుకలు నిర్వహించి, యోగా ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు.

• మండలంలోని ఇస్కపాళెం ప్రాథమిక పాఠశాలలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు.

యోగాతో అనేక ప్రయోజనాలు

కొడవలూరు : ప్రతిరోజూ యోగా చేయడం ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయని గండవరం ఆయుర్వేద వైద్యాధికారి ఎస్.గీత తెలిపారు. గండవరం హైస్కూల్‌లో యోగాపై శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్య పరిరక్షణకు యోగా బ్రహ్మాస్త్రంలా ఉపకరిస్తుందని చెప్పారు. శరీరానికి ఎలాంటి వ్యాయామం లేకపోవడం వల్లే తరచూ ఆరోగ్య సమస్యలకు గురవుతున్నారని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా యోగాకు ప్రాముఖ్యత పెరిగిందని, దీనిని ప్రతి ఒక్కరూ అవగతం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం జి.శ్రీనివాసరావు, యోగా శిక్షకులు జ్యోతి రాజేంద్రకుమార్, హిమబిందు, సుజాత, మాల్యాద్రి, ఉపాధ్యాయులు జి.నాగభూషణం, పి.శ్రీనివాసులు, కట్టా సురేష్, శివనాగబాబు, పుట్టయ్య, కుసుమ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం

మనుబోలు : యోగా సాధన ద్వారా శారీరక, మానసిక ప్రశాంతత లభిస్తుందని యోగా గురువు చెలికం కోటేశ్వరరెడ్డి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మనుబోలు జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో పలువురు యువకులకు శుక్రవారం యోగా శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా సాధన నేటి జీవన విధానానికి అత్యంత అవసరమన్నారు.

• మండలంలోని కాగితాలపూరు గ్రామంలో బీజేపీ జిల్లా కార్యదర్శి బోలా శ్రీనివాసులు యువకులతో కలిసి యోగా సాధన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శారీరక, మానసిక సమస్యల నుంచి యోగా సాధన ఉపశమనం ఇస్తుందన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని నగర పంచాయతీ పరిధిలోని రామచంద్రాపురం పాఠశాల ఉపాధ్యాయుడు సుధీర్‌కుమార్ అన్నారు. యోగా దినోత్సవం సందర్భంగా ఆ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. అనంతరం ఆయన మాట్లాడారు. రోజువారీ జీవితంలో యోగాను భాగంగా చేసుకోవాలని సూచించారు.



వెంకటాచలం : ఇస్కపాళెం పాఠశాలలో..



వెంకటాచలం : మాట్లాడుతున్న వీఎస్‌యూ వీసీ జీఎం సుందరవల్లి



కోవూరు మండల కేంద్రంలో..

కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

శారీరక ఆరోగ్యానికి యోగా తప్పనిసరి

విడవలూరు : శారీరక ఆరోగ్యానికి యోగా తప్పనిసరి అని ప్రిన్సిపల్ బి.సుజాతా అన్నారు. స్థానిక పీఆర్ఆర్–వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యోగా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ మానసిక ఉల్లాసానికి యోగా సాధన ముఖ్యమన్నారు.

• కోవూరు : పట్టణంలోని న్యూ లిటిల్ ఫ్లవర్స్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో శుక్రవారం యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు యోగసనాలు వేశారు.



కొడవలూరు : గండవరంలో యోగాపై శిక్షణ



మనుబోలు : యోగా సాధన చేయిస్తున్న శిక్షకుడు



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: రామచంద్రాపురం పాఠశాలలో..



విడవలూరు డిగ్రీ కళాశాలలో..

విశ్వనాథునికి రుద్రాభిషేకం



మనుబోలు : మనుబోలు, చెర్లోపల్లి రైల్వేగేటు సమీపంలో ఉన్న విశ్వనాథస్వామి ఆలయంలో స్వామివారికి శుక్రవారం పంచామృతాలతో రుద్రాభిషేకం గావించారు. అర్చకుడు శ్రీనివాసులు విశ్వనాథునికి ప్రత్యేక పుష్పాలంకరణ చేసి విశేష పూజలు జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. గంధళ్ల కృష్ణయ్య, అన్నపూర్ణమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

దేశంలో ప్రగతి పరుగులు

నెల్లూరు(మినీబైపాస్) : ప్రధాని నరేంద్రమోదీ చొరవతో భారతదేశంలో ప్రగతి పరుగులు పెడుతోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కర్నాటి ఆంజనేయరెడ్డి అన్నారు. స్థానిక రామ్మూర్తినగర్‌లో ఉన్న బీజేపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రధాని తన సహాయ సహకారాలు అందిస్తానని మాట ఇచ్చినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పరిపాలన సాగించాలని హితవు పలికారు. అసెంబ్లీలో నిర్మాణాత్మక చర్చలు జరగాలని, అందులో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు కూడా భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి చిలకా ప్రవీణ్, దాసరి రాజేంద్రప్రసాద్, గంజం పెంచలప్రసాద్, రాధాకృష్ణగౌడ్, లెక్కల రాజశేఖర్‌రెడ్డి, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

శ్యామ్‌సుందర్ భగవాన్‌కు డాక్టరేట్

వెంకటాచలం : విక్రమసింహపురి యూనివర్సిటీ(వీఎస్‌యూ) బోడావుల శ్యామ్‌సుందర్ భగవాన్‌కు డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈయన వీఎస్‌యూ ఆంగ్లశాఖ ఆచార్యుడు డాక్టర్ ఆర్.ప్రభాకర్ పర్యవేక్షణలో 'ది సెలెక్ట్ వర్క్స్ ఆఫ్ ఆర్ డబ్ల్యూ ఎమర్సన్ అండ్ అద్వైత వేదాంత ఏ క్రిటికల్ అండ్ కంపారిటివ్ స్టడీ' అనే అంశంపై పరిశోధన వ్యాసాన్ని సమర్పించారు. దీంతో శ్యామ్‌సుందర్ భగవాన్‌కు వీఎస్‌యూ వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లి శుక్రవారం డాక్టరేట్‌ను ప్రదానం చేసి అభినందించారు.



శ్యామ్‌సుందర్ భగవాన్‌కు డాక్టరేట్‌ను ప్రదానం చేస్తున్న వీసీ సుందరవల్లి

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

పొదలకూరు : రైతులకు సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలను రైతు భరోసా కేంద్రాల ద్వారా పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉంచామని మండల వ్యవసాయాధికారిణి గీతాకుమారి అన్నారు. పొదలకూరు పట్టణంలో శుక్రవారం రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జీలుగలు, జనుములు, పిల్లిపెసర తదితర పచ్చిరొట్ట విత్తనాలు అన్ని రైతు భరోసా కేంద్రాల్లో సిద్ధంగా ఉంచామని తెలియజేశారు. 50 శాతం సబ్సిడీతో రైతులకు పంపిణీ చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో ఏడీఏ శివానాయక్, టీడీపీ మండలాధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు, టౌన్ ప్రెసిడెంట్ బొద్దులూరు మల్లికార్జుననాయుడు, పెంచల భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు నాయుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఓ గీతాకుమారి

చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలి

వెంకటాచలం : తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని ఐసీడీఎస్ సీడీపీఓ విజయలక్ష్మి కోరారు. మండలంలోని చెముడుగుంట, కుంకుమపూడి అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న చిన్నారులకు ప్రీ స్కూల్ సర్టిఫికెట్లను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చిన చిన్నారులు పాఠశాలలకు వెళ్లేందుకు ఆసక్తి చూపుతారని తెలియజేశారు. నిత్యం అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు భవిష్యత్‌లో ఉన్నతంగా రాణిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, మహిళా పోలీసు సౌదామిని, హెల్త్ సూపర్‌వైజర్ రాజేశ్వరి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న సీడీపీఓ విజయలక్ష్మి

పిల్లలందరూ బడిలోనే ఉండాలి

ఇందుకూరుపేట : బడిఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలని ఎంపీడీఓ సాయిలహరి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నేడు బడికి పోతా కార్యక్రమంపై తహసీల్దార్ రమేష్, ఎంఈఓలు ఎస్వీ నాయక్, సునీల్‌కుమార్‌తో కలిసి శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 6 నుంచి 14 ఏళ్ల పిల్లలు తప్పనిసరిగా బడిలోనే ఉండాలన్నారు. క్షేత్రస్థాయిలో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి విద్యా విలువలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో మండలంలోని హెచ్ఎంలు పాల్గొన్నారు.

'నేను బడికి పోతా'పై ర్యాలీ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని డీఎల్ఎన్నార్ ఉన్నత పాఠశాలలో నేను బడికి పోతా కార్యక్రమంపై శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ దిలీప్‌కుమార్ మాట్లాడుతూ బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పేవిధంగా తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలన్నారు. అంతకు ముందు ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



ఇందుకూరుపేట : మాట్లాడుతున్న ఎంపీడీఓ సాయిలహరి

దోమలను నివారించుకోకుంటే ముప్పే



దోమల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్

కొడవలూరు : దోమలను నివారించుకోకుంటే ముప్పేనని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.నాగభూషణమ్మ సూచించారు. మండలంలోని గండవరం గిరిజన కాలనీలో దోమల నివారణపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో మురుగునీటి నిల్వలు, చెత్తా చెదారాలు లేకుండా చూసుకోవాలన్నారు. దోమల వల్ల మలేరియా, డెంగీ, చికెన్ గున్యా లాంటి ప్రాణాంతక వ్యాధులు సోకే ప్రమాదం ఉందన్నారు. ఇంటి పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, మురుగు నిల్వ ఉన్న చోట బ్లీచింగ్ చేసుకోవడం ద్వారా దోమలను నివారించుకోవాలన్నారు. వర్షాలు సమీపిస్తున్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు యు.రాజేశ్వరమ్మ, ఎం.మమత పాల్గొన్నారు.

వరిసాగులో కలుపు నివారణ ముఖ్యం



కొడవలూరు : మాట్లాడుతున్న కేవీకే శాస్త్రవేత్త



విడవలూరు : స్ప్రే గురించి డెమో ఇస్తున్న అధికారులు

• కేవీకే శాస్త్రవేత్త కిరణ్‌కుమార్‌రెడ్డి

కొడవలూరు : వరిసాగులో కలుపును నివారించుకోవడం ఎంతో ముఖ్యమని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ కె.కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని రామన్నపాళెం, గండవరంలలో వరిసాగులో మెళకువలపై శుక్రవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరిలో కలుపు నివారణకు అధికారుల సూచనలు తప్పక పాటించాలని తెలిపారు. జిల్లా వనరుల కేంద్ర ఏఓ చక్రవర్తి మాట్లాడుతూ ఎరువుల యాజమాన్యం, జీవన ఎరువుల ఉపయోగాలను తెలియజేశారు. ద్రవరూప ఎరువులైన నానో యూరియా, నానో డీఏపీలు వినియోగించడం ఎంతో ఉపయోగకరమని వివరించారు. కార్యక్రమంలో డీఆర్సీ ఏఓ ఎ.వాసు, ఏఈఓ ఎ.అనూష, వీఏఏలు ఆర్.నిహారిక, టి.కవిత, రైతు కె.శ్రీనివాసులు పాల్గొన్నారు.

వేరుశనగ పొలంలో స్ప్రేపై డెమో

విడవలూరు : మండలంలోని రామతీర్థం గ్రామంలో వేరుశనగ పొలంలో నానో డీఏపీతో స్ప్రే గురించి డెమో ఇచ్చామని ఆత్మ డీపీడీ శివన్నారాయణ అన్నారు. సాధారణంగా వినియోగించే డీఏపీ బస్తాల ద్వారా కాకుండా లిక్విడ్ రూపంలో ఉన్న డీఏపీని 500 ఎంఎల్‌ను ఎకరం పొలానికి వాడవచ్చని తెలిపారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త కిరణ్‌కుమార్, వీఏఏ సాయి మహేష్, రైతులు పాల్గొన్నారు.

పోలూరి శతజయంతి సమావేశం రేపు

నెల్లూరు(బృందావనం) : ఆంధ్ర వాల్మీకి బ్రహ్మశ్రీ పోలూరి హనుమ జానకీరామశర్మ శతజయంతి ఉత్సవాల 8వ సమావేశం పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్‌లో ఆదివారం సాయంత్రం 6 గంటలకు జరుగనుందని నిర్వాహకుడు వేదం రాధాకృష్ణమూర్తి శుక్రవారం తెలిపారు.

పద్యకళాపరిషత్ అధ్యక్షుడు మెట్టు రామచంద్రప్రసాద్ అధ్యక్షతన జరిగే సమావేశంలో తిక్కన సోమయాజి నాటకంపై డాక్టర్ చీమకుర్తి వెంకటేశ్వరరావు ఉపన్యాసం ఉంటుందన్నారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు.

కల్యాణోత్సవానికి సర్వం సిద్ధం



కల్యాణోత్సవానికి ముస్తాబైన ఆలయం



ఆలయం వద్ద వేచి ఉన్న భక్తులు

• గంగపట్నంలో భక్తుల కోలాహలం

ఇందుకూరుపేట : ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఇందుకూరుపేట మండలంలోని గంగపట్నంలో కొలువైన చాముండేశ్వరీదేవి అమ్మవారి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రధానంగా జరిగే కల్యాణోత్సవానికి ఏర్పాట్లను సర్వం సిద్ధం చేశారు. ఈ ఘట్టాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో శుక్రవారం రాత్రి గంగపట్నం చేరుకున్నారు. ఉత్సవాల సందర్భంగా గ్రామానికి విచ్చేసిన బంధువులు, స్నేహితులతో పాటు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తులతో గ్రామం కోలాహలంగా మారింది. కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక పూలంగి సేవ నిర్వహించారు. ఉభయకర్తలుగా స్థానికులు చేజర్ల వెంకటరమణయ్య, కవిత కుమారుడు వెంకట సందీప్ వ్యవహరించారు.

వేకువజామున కల్యాణం

చాముండేశ్వరీదేవి, త్రిశూలేశ్వరస్వామి కల్యాణోత్సవం శనివారం వేకువజామున జరుగుతుంది. ఈ నేపథ్యంలో నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు. ఈ క్రమంలో భక్తులు రాక శుక్రవారం సాయంత్రం నుంచే ప్రారంభమైంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని వేడుకున్నారు. ఆలయ సిబ్బంది భక్తుల కోసం ప్రత్యేక క్యూ లైన్లు, పందిళ్లను ఏర్పాటు చేశారు. ప్రతి ఏడాదిలానే స్వామి, అమ్మవారి కల్యాణోత్సవం సమయంలో పలువురు నూతన వధూవరులు దంపతులుగా ఒకటి కావడం ఆనవాయితీ. దీంతో వధూవరుల బంధువులు సైతం ఆలయానికి చేరుకున్నారు. బొమ్మలు, వస్తువుల దుకాణాలు, రంగురాట్నాలు వంటివి ఇప్పటికే గ్రామానికి చేరుకున్నాయి.

భారీ బందోబస్తు ఏర్పాటు

ఉత్సవాల్లో భాగంగా భక్తులు పెద్ద సంఖ్యలో గంగపట్నం చేరుకున్న నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నలుగురు సీఐలు, ఎనిమిది మంది ఎస్సైలు, 50 మంది కానిస్టేబుళ్లతో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు స్థానిక ఎస్సై వీరేంద్రబాబు తెలిపారు.